
# భేతాళుడు మళ్లీ చెట్టెక్కేడు

## చిలుకూరి దేవపుత్ర

ఉదయం పదిన్నర గంటలయింది...

అప్పుడే ఆఫీసుకు చేరుకున్నాడు జయరాం...

పదినిమిషాలకోమారు అతని ముక్కుపుటాలు అదురుతున్నాయి. ఐదు నిమిషాలకోమారు పళ్ళు పటపట కొరుకుతున్నాడు. రెండునిమిషాలకోమారు పిడికిళ్ళు బిగిస్తున్నాడు. నిమిషానికోమారు ఆవేశం కట్టలు తెంచుకొంటోంది. ప్రతి సెకనూ నరాల్లో రక్తం సలసలకాగిపోతోంది...



దేశంలో క్రిమినల్ కోడ్ అంటూ ఒకటి ఉండటం వల్ల, కోర్టులూ, పోలీసులూ, జైళ్ళూ అన్నవి ఉన్నాయన్న స్పృహ ఎక్కడో మెదడనే పదార్థంలో చోటుచేసుకొని ఉన్నందువల్ల, తన పెళ్ళాం పిల్లలూ దిక్కులేని వాళ్ళయిపోతారనే బలహీనత అతన్ని ఆవహించి ఉండటంవల్ల జయరాం ఇలా ఆఫీసుకు మామూలుగా రాగలిగాడే కాని, లేకపోతే తెల్లారే ఇంటి ఓనర్ని సంహరించి హంతకుడుగా మారిపోయి ఉండును.ఇదంతా చెబితే జయరాం కచ్చితంగా ఏ దుర్మార్గుడనో, దుష్టుడనో అనుకునే ప్రమాదం ఉంది.

అయితే అతను గంగిగోవులాంటి మనిషి అని అతని సహోద్యోగులూ, పసిరిక పామట్లాంటివాడని వాళ్ల పల్లెలోని బంధువులూ, పరమసాత్వికుడు అని అతని మిత్రులూ, పరిచయస్తులూ అంటూ ఉంటారు.

పెదాలపై వీడని చిరునవ్వుని అలంకరించుకునే సదరు గంగిగోవు ఉరఫ్ పసిరికపాము అలియాస్ పరమసాత్వికుడు ఇంత హఠాత్తుగా ఇట్లా ఎట్లా మారాడు? ఇది మీ అనుమానం..

దానికో ఫ్లాష్ బ్యాక్ ఉంది...

అదేమిటంటే..

ఆర్నెల్లక్రితం జయరాం హిందూపురం నించి ఈ ఊరికి బదిలీ అయి వచ్చేడు. మంచి అద్దె ఇంటి కోసం తెగ తిరిగేడు. చివరాఖర్న సాయినగర్‌లో మేడమీద ఉన్న ఇల్లు దొరికింది. దాని అద్దె రెండువేల రూపాయలు అన్నా వెనకాడలేదు. మూడు నెలలు అడ్వాన్సు ఇచ్చేసి పెళ్లాం పిల్లల్ని తీసుకు వచ్చి దించేడు. జయరాం భార్య మాధవికి కూడా ఇల్లు తెగ నచ్చేసింది. రెండు బెడ్‌రూములు ఉండటం, ఇంటి ముందు వసారా ఉండటం... అందులో రకరకాలయిన పూల మొక్కలు కుండీలో అందంగా ఉండటం... వడ్డించిన విస్తరి ముందుకూర్చున్నంత సంబరపడిపోయారు ఇంటిల్లిపాదీ...

ఇంటి ఓనరు అస్తమానం నిలువు నామం దిద్దుకుని గుళ్ళోనించి పూజలూ అవీ చేయించుకుని రెస్టు తీసుకోడానికి బయటికి వచ్చిన ముసలి దేవుడులా ఉంటాడు. అలా ఉండడానికి

కారణం వత్తయిన ముగ్గు బుట్ట లాంటి అతని జుట్టే! ఇక అతని భార్య తల కూడా ముగ్గుబుట్టే. రెండురూపాయల బిళ్లంత ఎర్రటి బొట్టును పెట్టుకుని.. ఓ అరవీశెడు కుంకాన్ని నిలువు పాపిట్లో పోసుకుని తెల్లటి చెంపలకు పసుపురాసుకుని పెద్ద ముక్కుకు బొటనవేలు సైజులో ఉన్న ఎర్రటి ముక్కుపుడక అమర్చుకుని, మెడలో కాసులపేరుతో, ఏరంగైనా సరే ముదురురంగున్న చీరా జాకెట్టులతో గుళ్లోంచి దేవుణ్ణి వెతుక్కుంటూ వచ్చిన ముసలి దేవేరిలా ఉంటుంది. మేడ్ ఫర్ ఈచ్ అదర్ అన్న ఆంగ్లసామెత వీళ్లని చూసేకే ఫామ్ చేసి ఉంటారని ఆంగ్లాచార్యులకు కూడా సందేహం కలక్కమానదు.

ఆ ముసలి దేవుడు రైల్వేలో ఉన్నతోద్యోగిగా పదవీ విరమణ చేసేక వచ్చిన డబ్బుతో మేడ ఇల్లు కట్టుకుని కింది ఇంటిలో వాళ్ళు ఉంటూ, మేడ ఇంటిని అద్దెకు ఇచ్చుకుంటూ కాలం గడిపేస్తున్నారు. వాళ్ల ఇద్దరు మగ పిల్లలూ, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడిపోయేరు. వాళ్లకు సమస్యలంటే ఎట్లుంటాయో తెలీదు. అందుకే వాళ్లిద్దరూ మాటలు రాని మనుషుల్లా లేదా మాటలు మరిచిన మనుషుల్లా ఉంటారు.

> ''ఏమప్పా! నువ్విచ్చే బోడి మూడు దుడ్డుల బాడుగకి బంగారమ్మాదిరి ఉండే మా ఇంటిని పాడు జేసుకోవల్లా? మేమేమి ఉద్దరగా వచ్చిన దుడ్లతోనో, లంచాలు తీసుకున్న దుడ్లతోనో ఇల్లు కట్టుకోలే.. కష్టపడి సంపాదిచ్చిన దుడ్లతోనే కట్టుకున్నేం. పది దినాలు మా ఇంట్లో ఇంత జనం ఉంటే ఎట్ల? మెజాయిక్కు ఫ్లోరింగ్ అరిగిపోతాదీ- గోడలకుండే రంగు నాశనమైపోతాది. టాయిలెట్ గుంత నిండిపోతాది. నీళ్ల మోటరు సమసిపోతాది.. ''

ఉన్నట్టుండి సంక్రాంతి సెలవులకు గానూ మాధవి చెల్లెళ్లు ముగ్గురూ వాళ్ల మొగుళ్లతో, పిల్లలతో ఆ ముందురోజు సాయంత్రం దిగేవరకూ ఉన్న పరిస్థితి అదీ...

వచ్చిన వాళ్లకి భోజనాలు తయారు చేయడంలో ఉండిపోయేరు జయరాం, మాధవిలు. సరిగ్గా ఎనిమిదిన్నర అవుతున్నట్టే ముసలి దేవుడూ, దేవేరీ వచ్చేసేరు.

''వీళ్లంతా ఎవరు? ఎందుకొచ్చినారు?'' అంటూ జయరాంని ప్రశ్నించేరు.

పాపం ముసలి దంపతులు వచ్చిన కొత్తమనుషుల్ని, పలుకరించిపోదామని వచ్చేరేమోననీ, ''రండిసార్! లోపలికి రండి.. మీరు రండమ్మా! అట్లా సోఫాలో కూచోండి!'' అంటూ సాదరంగా ఆహ్వానించేడు జయరాం.

అందాకా పిల్లల అల్లరితో గోలగోలగా ఉన్న ఇల్లు చప్పుడు లేకుండా పోయింది.

''మేం కూచోడానికీ, మర్యాదలు పొందటానికి రాలేదప్పా!'' అన్నాడు ముసలి దేవుడు. మాటల్లో సౌమ్యత లేదన్న విషయం జయరాం, మాధవిలకు అర్థమైపోయింది.

''అసలు మీరూ మీ పిల్లలూ అంటే మొత్తం నలుగురు- నలుగురున్న మీ చిన్న కుటుంబానికే మేం అద్దెకిచ్చినాం'' అంది ముసలి దేవేరి. అపరకాళికా అవతారం ఎత్తబోయేముందు మొహాన్ని వికృతంగా మార్చేసి, కోరపళ్ళు చూపిస్తున్నట్టు ఉందామె తీరు. మాధవి చెల్లెల్లూ, వాళ్ల మొగుళ్ళూ, పిల్లలూ బిత్తరపోయి వాకిట్లో ప్రశ్నార్థకం మొహాలేసుకుని చూడసాగేరు.

''అదేంటండీ! ఎవరింటికైనా వాళ్లవాళ్ల బంధువులు రాకుండా ఉంటారా?'' అంటూ వచ్చిన కొత్త వాళ్ళు తమకేమవుతారో నెమ్మదిగా వివరించి చెప్పింది మాధవి.

అసహనంగా విని- '' ఎన్నాళ్లుంటారు?'' అంది ముసలి దేవేరి. మొహాన్ని మరింత వికృతంగా మార్చేస్తూ.

''ఎన్నాళ్ళూ అంటే ఒక పదిరోజులుంటారు.''

''నో. వీళ్లిక్కడ ఒక్క క్షణం ఉండడానిక్కూడా వీల్లేదు. మా ఇల్లు సత్రం కాదు. లాడ్జి అంతకన్నా కాదు.'' అన్నాడు ముసలి దేవుడు పూనకం వచ్చిన వాడిలా ఊగిపోతూ.

''అట్లాంటే ఎట్ల సార్! అన్నీ తెలిసిన మీరూ...'' అంటూ సర్ది చెప్పబోయేడు జయరాం బిక్కమొగం వేసుకుని.

''ఏమప్పా! నువ్విచ్చే బోడి మూడు దుడ్డుల బాడుగకి బంగారమ్మాదిరి ఉండే మా ఇంటిని పాడు జేసుకోవల్లా? మేమేమి ఉద్దరగా వచ్చిన దుడ్లతోనో, లంచాలు తీసుకున్న దుడ్లతోనో ఇల్లు కట్టుకోలే.. కష్టపడి సంపాదిచ్చిన దుడ్లతోనే కట్టుకున్నేం. పది దినాలు మా ఇంట్లో ఇంత జనం ఉంటే ఎట్ల? మీ అట్లా చిన్న కుటుంబాలు ఐదేండ్లు ఉంటే ఎంత పాడయిపోతాదో, రెండు దినాలకే అంత పాడయిపోతాది. మెజాయిక్కు ఫ్లోరింగ్ అరిగిపోతాదీ- గోడలకుండే రంగు నాశనమైపోతాది. టాయిలెట్ గుంత నిండిపోతాది. నీళ్ల మోటరు సమసిపోతాది.. '' అంటూ ముసలి దేవేరి కేకలు వేస్తున్నట్టు మాట్లాడేస్తూ ఉంది.

అందమైన కొండ అగ్నిపర్వతమని లావా ఎగిసిపడేవరకూ తెలీదు మరి! ఆ ముసలి దేవుడిలో రాక్షసుడినీ, ముసలి దేవేరిలో బ్రహ్మారాక్షసినీ అప్పుడు చూసేరు జయరాం దంపతులు.

''మా వాళ్లందరూ ఇక్కడే మా ఇంట్లోనే ఉంటారు.. పదిరోజులు కాదు. పదేళ్ళుంటారు. నువ్వేం చేసుకుంటావో చేసుకో! నీ దిక్కున్నచోట చెప్పుకో!'' అన్నాడు జయరాం ఆవేశంగా.

''నాకు ఏ దిక్కు లేదనుకోవాకు- ఈ రాత్రికి వీళ్ళంతా ఇక్కడ నించి పోకపోయినారో అప్పుడు నీకథ చెప్తా!'' అన్నాడు ముసలిదేవుడు రెట్టింపు ఆవేశంతో.

ముసలి దేవేరికి ఏమనిపించిందో కానీ- ''ఈ రాత్రికి ఎట్లపోతారు? పిల్లల్తో ఇబ్బందే కదా, రేపు పోతార్లే.. ఏమప్పా! జయరామా! రేపు మాత్రం ఎవురూ ఉండరాదు..'' అంది.

జయరాం ''ఊఁ'' అనలేదు. చురచుర చూస్తూ ఉన్నాడు.

ఇంక అక్కడ ఉండటం అంత మంచిది కాదని ముసలి దేవేరి, దేవుడి జబ్బ పట్టుకుని లాక్కెళ్ళింది కిందికి.

ఉరిశిక్ష ఖైదీకి మరోరోజు ‘ ఉరి’ కి గడువు పెంచినంత తేలికపడింది జయరాం మనసు.

***

తెల్లారే కొళాయి నీళ్లు విడుస్తారు కార్పొరేషన్ వాళ్ళు.

మామూలుగా అయితే జయరాం వాళ్ళకి పదిహేను బిందెలు వదుల్తారు ఇల్లుగలవాళ్ళు. కాని అప్పుడు మాత్రం కావాల్సిగానే ఐదు బిందెలు మాత్రమే వదిలారు. అవి తాగడానికి మాత్రమే సరిపోతాయి. స్నానాలకి ఇబ్బందే!

ఎప్పట్లాగే తమ వంతుకి వచ్చే తక్కిన పది బిందెలూ ఇవ్వాల్సిందిగా జయరాం అడిగేడు.

ముసలిదేవుడు ఉరఫ్ రాక్షసుడు. ముసలి దేవేరి అలియాస్ బ్రహ్మరాక్షసి వీల్లేదు పొమ్మన్నారు. మీ బంధువులు ఇంటిని వదిల్తేనే మీ వంతు నీళ్ళు ఇస్తామని కరాఖండిగా తేల్చి చెప్పేరు.

దాంతో వాదోపవాదాలు పెరిగి మూడోప్రపంచ యుద్ధమే జరిగింది. అయినా ఒక్క చుక్క నీళ్ళు కూడా సాధించలేకపోయేడు జయరాం.

మరదళ్ళు ముందరా, షడ్డకుల ముందరా తల కొట్టేసినంత పనయింది అతనికి.

ఆ ఉదయమే పదిగంటలకల్లా వచ్చిన వాళ్లంతా వెళ్లిపోయేరు...

మరలాంటి స్థితిలో జయరాం ఇంకెట్లా ఉంటాడు..

***

''ఏంటిగురూ! అదోలా ఉన్నావు.'' అంటూ పరుశురాం పలకరించేడు. అతనిది తన ఎదురుగా ఉన్న సీటే. ఉన్న విషయమంతా చెప్పేడు జయరాం.

''ఇప్పుడు ఇల్లు మారాలని నీ ఉద్దేశం కూడా.. మరయితే ఓ పని చెయ్యి గవర్నమెంటు క్వార్టర్స్‌లో ఒక ఇల్లు చాలాకాలంగా ఖాళీగా ఉందని ప్రకాష్ చెప్పాడు ఇందాకా.. ఇప్పుడు అతనే గవర్నమెంటు క్వార్టర్స్ సబ్జెక్టు డీల్ చేస్తున్నది. ఎందుకైనా మంచిది ఓ అప్లికేషన్, కలెక్టర్ని అడ్రస్ చేస్తూ ఇచ్చెయ్యి. రెండురోజుల్లో నీకు ఆ క్వార్టర్సుని అలాట్ చేస్తారు. అప్పుడు నీకు ఇంటి ఓనరు గాళ్లతో ఈ గొడవలూ, రాద్ధాంతాలూ ఉండవు. ఏమంటే నీకు ఇంటి అద్దె అలవెన్సు జీతం నుంచీ కట్ చేస్తారు. అంతే'' అన్నాడు పరశురాం.

జయరాంకి ఆ మాటలు కొంత ఊరడింపు కలిగించేయి. వెంటనే గవర్నమెంటు క్వార్టర్సుకోసం అర్జీ రాసి జిల్లా రెవిన్యూ అధికారి గారికి ఇచ్చేసి వచ్చేడు జయరాం. రెండు రోజుల తర్వాత గవర్నమెంటు క్వార్టర్సులో సి2 ని అలాట్ చేసినట్టు ఉత్తర్వులు వచ్చేయి. పట్టరాని ఆనందంతో ఇంటికి చేరుకుని ''చూశావా మన ప్రతాపం!'' అంటూ కాలరెగరేసి ఉత్తర్వుల్ని చూపించేడతను. రాక్షసుల ఇల్లు

వదిలేసే క్షణాలు సమీపిస్తున్నందుకు పరమానందభరితురాలయింది మాధవి.

ఆ సాయంత్రమే తాము చేరబోయే క్వార్టర్సును చూసేందుకు వెళ్లేరు జయరాం, మాధవిలు.

***

వయసు మళ్లినా రీవి కుంగని వృద్ధ ప్రభుత్వ ఉద్యోగుల్లా ఉన్నాయి ఆ గవర్నమెంటు క్వార్టర్సు. నాలుగు వరుసల్లో కట్టిన రాతి భవనాలకి పెద్ద కాంపౌండు ముసలి ముత్తయిదువకు వెండి వడ్డాణంలా ఉంది. అందులోకి అడుగు పెట్టారు జయరాం దంపతులు.

ధర్మాసుపత్రిని చూస్తే ఆడాళ్ల ప్రసూతి వైరాగ్యం, భూమితనఖా బ్యాంకుల్నిచూస్తే రైతులకి వ్యవసాయ వైరాగ్యం వచ్చినట్టు... ఆ క్వార్టర్సుని చూస్తూనే జీవన వైరాగ్యం వచ్చేసింది మాధవికి.

''తొందరలోనే ఇక్కడ ఎనిమిదో వింత జరగబోతోంది మాధవీ!'' అన్నాడు జయరాం ఆ భవనాలన్నింటిని ఓసారి విహంగ వీక్షణం చేసి.

''ఎవరు చెప్పినారు?''

''ఎవరో ఏమిటీ నేనే. కనుక్కొన్నాను.. అక్కడెక్కడో వేలాడే ఉద్యానవనం ఉండదుకదా! ఇప్పుడు ఈ బిల్డింగ్స్ అన్ని గోడలలో మొలచిన రావి, జీవి, మర్రి మొక్కలు చూడూ... త్వరలోనే వేలాడే కీకారణ్యం అయ్యేలా లేదూ! అప్పుడు ఇది ఎనిమిదో వింతే!''

మాధవి నవ్వలేదు. అక్కడే క్రికెట్ ఆడుకుంటున్న పిల్లల్ని అడిగింది. సి2 క్వార్టర్సు ఎక్కడ అని 'అదిగో' అంటూ చూపించేరు ఆ పిల్లలు.

నాలుగు మేడల్ని కలిపికట్టిన ఆ భవనంలో కింది వరుసలో రెండోదే సి2 క్వార్టర్సు. అక్కడికి చేరుకున్నారిద్దరూ. ఆ ఇంటికి తాళం వేసి ఉంది. ఎవర్నడగాలా అని తటపటాయిస్తున్నట్టే.... ఉన్నట్టుండి పదేళ్ల కుర్రాడు ఎక్కడినుంచో ఊడిపడ్డాడు.

''అంకుల్! మీరీ ఇంట్లో చేర్తారా? అయితే, ఇదిగో కీ అంటూ ఇచ్చేసి పరిగెత్తుకుంటూ వెళ్లిపోయేడు.

తాళం తీసి లోపలికి అడుగుపెట్టారు. అది గృహంలా లేదు. గుహలా ఉంది. ఇల్లయితే చాలా పెద్దదే. రెండు బెడ్రూములూ, ఒక హాలూ, కిచెన్, డైనింగ్ హాలూ అవీ అన్నీ ఉన్నాయి. అయితే ఇక్ష్వాకుల కాలం నాడు గోడలకి వేయించిన రంగులు వెలిసి పోయి, పెచ్చులు ఊడిపోయి ఉన్నాయి. వంటిల్లు పొగచూరి ఉంది. హాల్లో మంచం మీద మాసిపోయిన దుప్పటి పరిచి ఉంది.

''రాత్రిళ్ళు ఎవరో ఈ ఇంటిని వాడుకుంటున్నారు'' అంది మాధవి.



## తప్పేముంది

సెలినా ఈమధ్య ఒక తెలుగు సినిమాలో నటించింది కానీ; ఎవరూ పట్టించుకోలేదు. దాంతో బుద్ధిగా బాలీవుడ్ వెళ్ళిపోయింది. ఈమధ్య సెలినా యాక్ట్ చేసిన 'నో ఎంట్రీ' హిట్టయ్యింది. అయితే పత్రికలన్నీ బిపాసా, లారాదత్తా గురించే రాశాయి. ఇకపోతే మల్లికా షెరావత్‌తో సెలినాకి అస్సలు పడ్డంలేదు. ఇద్దరు ఒకర్నొకరు ఈమధ్య తిట్టుకున్నారు. మల్లికా వద్ద ఎక్స్‌పోజింగ్ తప్ప ఇంకేమి లేదని సెలినా తిడితే, మల్లికా కూడా అదే మాటంది. ''జీవితమనేది ఒకే ఒకసారి వస్తుంది. ఆ జీవితంలో యవ్వనం ఒకసారే వస్తుంది. మనకున్న అందాల్ని చూపిస్తే తప్పేముంది. ఎక్స్‌పోజింగ్ లేకుండా బాలీవుడ్‌లో ఇప్పుడెవ్వరూ హీరోయిన్స్ కాలేరు'' అంటోంది సెలినా.

'గతజన్మలో ఈ మనిషి డిటెక్టివ్ అయి ఉంటుంది' అనుకున్నాడు జయరాం.




''ఈ ఇల్లు మీకు అలాట్ అయిందా సార్!'' అంటూ ఓ గంభీర మైన కంఠం వినిపించేసరికి తిరిగి చూశారు ఇద్దరూ. పెద్దపెద్ద మీసాలతో, మాసిన గడ్డంతో ఉన్న అతన్ని చూస్తూనే బనియనూ, లుంగీతో అడవినించీ పారిపోయి వచ్చిన అడవి దొంగ వీరప్పన్ బ్రదర్‌లా ఉన్నాడనిపించింది ఇద్దరికీ.''అవునండీ!'' అన్నాడు జయరాం. అతని మీసాలకీ, మొహానికి ఎక్కడ పొందిక కుదరడం లేదే అని పరిశీలిస్తూ. ''బానే ఉంటుంది. ఏమంటే ఈ ఇంట్లో చేరాలంటే కొంచెం ధైర్యం, డబ్బూ ఉండాలి'' అన్నాడు వీరప్పన్ బ్రదర్, నవ్వాలని ప్రయత్నిస్తూ.

''ఎందుకు?'' అన్నాడు జయరాం.

''అబ్బే! ఏం లేదండీ! అల్లదిగో ఆ క్వార్టర్స్ చూసేరా? వాటిని డీ టైపు క్వార్టర్స్ అంటారండీ! అందులోనేమో...

పంతొమ్మిదొందల డెబ్బై ఆరులో ననుకుంటా... కలెక్టరాఫీసులో పనిచేసే ఒక టైపిస్టు కాపురం చేసేవోడండీ! మేము ఆ ఇంటి కింద ఉన్న ఇంట్లోనే ఉంటున్నాం.''

'వీడేదో కథ చెపుతున్నాడు...అయినా ఎందుకు చెపుతున్నాడో... ఎందుకు ఆపడం.' అనుకున్నాడు జయరాం. కాని మాధవి మాత్రం '' ఉంటే?'' అంది కాస్త అసహనంగా.

''మేడం మేడం.. కొంచెం ఓపిగ్గా వినండి.. ఆ టైపిస్టుకి భార్య, ఇద్దరు చిన్నపిల్లలు, ఉన్నారు. ఆ రోజు పొద్దున్న ఎప్పట్లాగే కరెంటు హీటర్ని బకెట్లో వేసి స్విచ్చి ఆన్ చేసిందండీ. పదిహేను నిమిషాల

తర్వాత నీళ్లు ఏమాత్రం వేడెక్కాయా అని బకెట్లో చేయి పెట్టింది. అంతే– ఆమె అలా షాక్‌కి గురయి ఉండిపోయింది. అది

గమనించిన భర్త.. ఆత్రంగా ఆమెను పక్కకి నెట్టాలని వట్టి చేతులతో పట్టుకున్నాడు.. అంతే.. అలా ఇద్దరూ ఒకేసారి ప్రాణాలు వదిలేశారు. పిల్లలిద్దరూ దిక్కులేని వాళ్లు అయిపోయారు.''

''అవును. అప్పట్లో పేపర్లో వేసినారు. నేనూ అదే ఆఫీసులో పని చేస్తున్నా... అది సరే ఇప్పుడు ఎందుకు చెప్పారు ఇదంతా!'' అని అడిగాడు జయరాం.

''అబ్బే ఏం లేదండీ! రాత్రిళ్లు ఎప్పుడయినా మా ఇంటికి బంధువులు వస్తే, ఇల్లు చిన్నది కదండీ, ఈ ఇల్లున్నంత పెద్దది కాదు మాది. అందుకని, నేను నా భార్య ఈ ఇంట్లో పడుకుంటూ ఉంటాం.. అక్కడ ఉన్నది మా మంచమేనండీ... అర్ధరాత్రి దాటేక పక్కగదిలోనో, వంట ఇంటిలోనో గల్లుగల్లు మంటూ శబ్దం అవుతుంది. అలా అయినప్పుడు మేం లేవం. గట్టిగా కళ్లు మూసుకుని పడుకుంటాం. మొన్న ఓసారి మాత్రం నాభార్య గుండెల మీద ఎవరో కూచున్నారని గట్టిగా కేకేసి నన్ను లేపింది. లేచి చూస్తే ఎవరూ లేరు. ఇదంతా డీ క్వార్టర్సులో చచ్చిపోయిన వాళ్ల తాలూకు అని మాత్రం నా అనుమానం. అందుకే కొంచెం ధైర్యం ఉండాలన్నాను.''

జయరాం కొంచెం ఝుడుసుకున్నాడు.

మాధవి సీరియస్‌గా అతని వంకే చూస్తోంది...

''మరొకటి సార్! టాయిలెట్ పనిచేయదు. రిపేరు చేయించుకోవాలి. ఏ గదికీ అరలు సరిగ్గా లేవు. అవి కట్టించుకోవాలి. రంగులు, సున్నం వేయించుకోవాలి. ఇకపోతే, ఈ ఇంటికి కరెంటు ఉంది కానీ మీటరు అసలు పనిచేయదు. దాదాపు ఆరేళ్లుగా కరెంటు బిల్లు ఇవ్వలేదు. దాన్ని ఇచ్చేట్టు చేసుకోవాలి. మినిమమ్ ఓ ఐదువేలు ఖర్చవుతుంది... అందుకే దీంట్లోకి

చేరాలంటే డబ్బుండాలి అన్నాను.''

అంతా చెప్పేసేక 'వస్తానండీ! ఈ క్వార్టర్సులో మరెక్కడయినా ఖాళీ అయితే అందులో చేరడం బెటరు.. చెప్పాల్సింది చెప్పాను'' అని వెళ్లిపోయేడు వీరప్పన్ బ్రదర్.

***

'ఛ. ధెయ్యాలకొంప దొరికిందేమిటే!'' అన్నాడు విసుగ్గా జయరాం తిరిగి వచ్చేప్పుడు.

''అది దెయ్యాలకొంపేంకాదు. ఆ మీసాల వీరప్పన్ ఆ ఇంటిని వాడుకుంటున్నాడు. మనం ఆ ఇంట్లో చేరకుండా దెయ్యాల కథ చెప్తా ఉండాడు. అదే నిజమయితే ఆ టైపిస్టు దంపతులు చనిపోయింది వాళ్లున్న ఇంటి మేడపైనే కదా! అక్కడలేని దెయ్యాలు ఇక్కడికెందుకొస్తాయి.'' అంది.

మాధవిలా తను ఆలోచించనందుకు కొంచెం సిగ్గుపడి, ఈ మనిషి కచ్చితంగా గత జన్మలో డిటెక్టివే! అనుకున్నాడు.

''అయితే చేరదామా?''

''ఊఁ .. వీరప్పన్ అన్నట్టు రిపేర్లకి కొంత డబ్బు ఖర్చవుతుంది... ఏం చేద్దాం.. ఇంటి ఓనర్లు ఉండరు కదా...''

***

అప్పటికి వారం రోజులయింది జయరాం వాళ్లు సి2 క్వార్టర్సులో చేరి. మంచి పౌరుడి లక్షణాలు చాలామంది కంటే

జయరాంలో కాస్తంత ఎక్కువే ఉండటం వల్ల కరెంటు ఆఫీసుకు పోయి మా క్వార్టర్సుకు కొత్త మీటరు బిగించి, బిల్లు ఇవ్వండి అంటూ అర్జీ ఇచ్చుకున్నాడు.

రోజూ సాయంత్రం జయరాం ఆఫీసునుంచి ఇంటికొస్తూనే ''కొత్త మీటరు బిగించారు. బిల్లు ఇచ్చారు. నోటీసూ ఇచ్చారు.'' అంది మాధవి. బిల్లూ, నోటీసూ చేతికిస్తూ.

సంతోషంగా కొత్త మీటరు వేపోసారి చూసి, బిల్లుని చూశాడు. అది షాక్ కొట్టింది.

''ఏంటీ షాక్ తిన్నారా? నేనూ మీ మాదిరే షాక్ తిన్నాను. పోయిన నెల బిల్లు రెండువందల రూపాయలూ బకాయిలు పన్నెండు వేలా రెండు వందల రూపాయలు.. అప్పుడే ఏమయిందీ.. ఇంకా ఆ నోటీసు చూడండీ.. ఏం రాసుందో.. ఈ నెల పదిహేడవ తేదీ లోగా అరియర్స్‌తో పాటూ మీరు బిల్లు చెల్లించని పక్షంలో మీకు శాశ్వతంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడును.. అని ఉంది. ఇట్లా ఉంది మన అదృష్టం.. పెనం మీద నుంచీ పొయ్యిలో పడ్డట్టు...'' అంది మాధవి బాధని ఎలా చెప్పాలో తెలీక. ఆమె కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

వెంటనే కరెంటు సబ్ స్టేషనుకు వెళ్లి జూనియర్ ఇంజనీర్ని నిలదీశారు జయరాం. ఆయన ఒకటే చెప్పేడు. ''చూడు మిష్టర్. అవి గవర్నమెంటు క్వార్టర్సు కదా! అంతా అఫిషియల్స్ ఉంటారు కదా అని మేము ఎప్పుడూ కరెంటు కట్ చేయలేదు. ఇంతకు ముందు ఆ ఇంట్లో ఉన్న వాళ్లెవరూ బిల్లు కావాలని అడగలేదు. మేము ఇవ్వలేదు. మీరు అడిగేరు. బిల్లు ఇచ్చాం... బిల్లుతో పాటూ నోటీసు కూడా ఇవ్వాలి కదా! అందుకే అదీ ఇచ్చాం. మీరు అరియర్స్ కట్టకపోతే పవర్ కట్‌చేస్తాం ఇందులో ఏం ములాజా లేదు..'' అన్నాడు అతను సీరియస్‌గా.

కాల్చని కరెంటుకు అంత డబ్బు ఎట్లా కట్టడం!!!!

మళ్లీ ఇల్లు మారాల్సిందే....

★